కొడుకుకోసం
పరితపించిన
ఆ తల్లిదండ్రుల
జీవితంలో గాలివాన?

స్వాతి
కథ

# గాలివాన

గాలివాన!

అంతవరకూ ప్రశాంతంగా కళకళ్ళాడిన వాతావరణం— ఒక్కసారిగా ఒళ్ళిర్చుకొంది.

నిశ్శబ్ద మలయమారుతం— విలయతాండవం ప్రారంభించింది.

సంధ్యవేళ—

"దీపం— సర్వమంగళ మాంగల్యం
దీపం— సర్వలోక తిమిరాపహం
సంధ్యా దీపం నమోస్తుతే..."

సంధ్యా వందనం ముగించి కళ్ళు తెరిచిన కృష్ణవేణి

ఎదురుగా— మెల్లగా జార్తున్న చీకటి తెరలు.

ఆరిన దీపం

చిగురాకులా ఒక్కరవ్వ ఒణికిందామె.

"కృష్ణే... దీపాలు వెలిగించు"

శంకరశాస్త్రిగారి కంచుకంఠం ఖంగుమంది.

"ఆ... ఆ... తెస్తున్నా..."

"నట్టనడి వేసవిన ఈ ఒణికింపులేమిటే ...." అనుకుంటూనే కిరసనాయిల్ దీపం బుడ్లు అందుకొందామె చేతులు యాంత్రికంగా పనిచేస్తూనే వున్నాయి. మనసు దారి మనసుదే. ఎక్కడో దూరాన పట్నంలోవున్న కొడుకు మనసులో తొంగి చూసాడు.

"రాముడు ఎలా వున్నాడో?" మనసు ఆత్రుత పడింది. కళ్ళు చమర్చాయి.

"అద్దాలలో బిడ్డలుగాని..."

ఒక్కగానొక్కడు..." ఎందుకురా అంత దూరాన మనకు లేదా పోదా... ఇక్కడున్నది చాలు కలిసి వుందాం" అంటే




వినదు.

"నా ఒంట్లో ప్రాణం వుండగా ఈ ఇల్లు వదలనని" శంకరశాస్త్రిగారు.

ఏడాదికో ఆర్నెల్లకో– పిల్లలకు సెలవలు న్నపుడు మొక్కు బడిగా వచ్చి వెళ్తారు.

దాదాపు పది పదిహేను అగ్గిపుల్లలు దండగైపోయాయి. గీసీ గియ్యగానే ఆరిపోవ డం... పురిట్లోనే సంధి కొట్టినట్టు...

"కృష్ణా"

"తెస్తున్నానండి అగ్గిపుల్ల నిలవడంలేదు" రెండు చేతులూ అడ్డం పెట్టి లాంతరు వంచి—

అతి కష్టంమీద వెలిగించారావిడ. లాంతరు తీసుకుని ముందు వసారాలోకి నడిచారు.

"అనుకోకుండా ఈ అర్ధాంతరం మబ్బులూ— ముసురూ ఏవిటో..." స్వగతంగా అందావిడ.

"తుపాను వచ్చే సూచనలున్నాయని చెప్పారిప్పుడే— లోతట్టు ప్రాంతాలవారిని ఖాళీచేసి వెంటనే వెళ్లిపొమ్మని ఈ ఆరుగంటల వార్తల్లో చెప్పారు..."

"ఇప్పుడేమి తుపానండీ... ఎటూగానివేళ... వడివేసవిలో...."

"వాన రాకడ... ప్రాణం పోకడ ఎవరికి తెలుసు? అలాగే తుపానూ..."

"రాముడు ఎలాగున్నాడో...."

ఆ మసక వెలుతురులోనే నిదానించి ఆవిడ మొహంలోకి చూసారు శంకరశాస్త్రి గారు.

"కృష్ణా తుపాను ఇక్కడ... ఈ కృష్ణా తీరాన... అక్కడ హైదరాబాద్‌లో కాదు."

"చాల్లెండి. మీ వ్యంగ్యం నాకు అర్థమైంది కాని... ఎందుకో ప్రొద్దుటినుండీ వాడే గుర్తుకువస్తున్నాడు. కళ్ళల్లో మెదులుతున్నాడు..."

ఆవిడ కళ్ళు చమర్చాయి. ఆ చెమరింపు నిగనిగ ఆయన మనసులో ప్రతిఫలించింది.

ఆర్నెల్ల క్రితం కొంచంగా పరామర్శించిన పక్షవాతంతో అంతగా కదిలించలేని కుడిచెయ్యి నెమ్మదిగా ఎత్తి ఆవిడ చెక్కిళ్ళు నిమురుతూ—

"పోనీ... వెళ్లివస్తావా ఓసారి?"

దాని అర్థం గ్రహించిన ఆవిడ అడ్డంగా తలవూపి—

"ఇద్దరం ఒక్కసారే వెళ్దాంలెండి" అని జవాబిచ్చింది.

"పిచ్చిదానా... నాకు మాత్రం వాడి మీద ప్రేమ లేదనుకున్నావా? నువ్వు తల్లివైతే నేను తండ్రిని. పదేళ్ళు ఎదురుచూసి ఎదురుచూసి మనం సీతారాముల కళ్యాణం జరిపించడం— వెంటనే వాడు నీ కడుపున పడటం నేను మరచిపోయాననుకున్నావా? అందుకే కదా మనం సీతారామశాస్త్రి పేరెట్టుకున్నాం.

కృష్ణా నీకు తెలియని మరో నిజం చెప్పనా... ఇంకా పిల్లలుంటే మన ప్రేమ సమంగా పంచవలసి వస్తుందన్న బాధతో ఒక్కడే చాలమనుకున్నాను. కాని... కాని వాడు పెళ్లయిన నాలుగోనాడే ఆస్తి పంచివ్వమని అడిగాడు.

దానికి నేనిచ్చిన జవాబే వాణ్ణి మనకు దూరంగా వుంచింది. "ఆస్తి పంచటంకాని, అమ్మటంకాని అన్నీ నా తరువాతే" అని నీకంటే ఎక్కువగా నేనుబలాటపడ్డాను వాడితోపాటు మనిద్దరం వెళ్లి వాడి అచ్చటా ముచ్చటా చూడాలనీ, మనవలతో కాలం గడపాలనీ... నీకు తెలీదు— నేనోసారి ఉత్తరం వ్రాసాను... జవాబు చదువుతావా? నేను చెప్పలేదు కాని జాగ్రత్తగా దాచి వుంచాను."

"వద్దు... మీరు చెప్పండి చాలు"

అందులో అక్షరం అక్షరం కంఠతా వచ్చేసింది. అది విను.

నాన్నా,

మీరూ అమ్మా వస్తామని రాసారు. సంతోషం. కాని మీకిక్కడి సంగతుల గురించి కొంచం వివరించాలి. మన వూళ్లోలా ఇక్కడ పెద్ద ఇళ్ళూ వాకిళ్ళూ వుండవు. నా ఆదాయంలో ఓ మూడు గదుల ఇల్లు మాత్రం తీసుకో గలిగాను. ఆ మూడింటిలో ఓ గది నాకూ మీ కోడలికీ. ఓ గది పిల్లలకోసం— మరోటి డ్రాయింగ్ రూమ్. పెద్ద ఇళ్ళు కావాలంటే ఆదాయంలో సగం దాని అద్దెకే సరిపోతుంది. ఇక ఆహార వ్యవహారాలకు వస్తే పాలూ— పెరుగూ పుష్కలంగా దొరకవు. దొరికినా మనస్తోమతు దానికి సరితూగదు. అన్నిటా సరిపెట్టుకోవలసిన స్థితే. ఎవరింట్లో వారు కాలం వెళ్లబుచ్చాలి తప్ప— ఇరుగూ పొరుగులతో పొసగదు.

ఆర్థిక పరిస్థితుల్ని అదుపులో పెట్టుకొందుకుగాను మీ కోడలు ఓ చిన్న ప్రైవేట్ స్కూల్‌లో చేరింది. మేమందరం పొద్దున ఎనిమిదింటికి వెళ్తే తిరిగి ఇంటికి చేరేది సాయంత్రం ఆరు తరువాతే. ఇవన్నీ దృష్టిలో వుంచుకొని మీరు మరోసారి ఆలోచించండి.

అయినా మరో సలహా మన ఇల్లూ పొలాలూ అమ్మి ఇక్కడే ఓ ఇల్లు కొనుక్కుంటే బావుంటుందని నాకనిపిస్తోంది. అమ్మకి నమస్సులు.


మీ ఇష్టం వచ్చినట్టు చెయ్యండి.

మీ

రాముడు

ఇది విని నువ్వనుకుంటున్నావేమో— మన రాముడేనా ఇలా వ్రాసిందని— అక్షరాలా వాడే వ్రాసాడు.

కృష్ణా నీకు గుర్తుందా? పెళ్ళై వచ్చిన కొత్తలోనే నీ కొత్త మెరుగు కూడా తరగని నగలన్నీ నా చెల్లెలు— అదే మన కళ్యాణి పెళ్లికి మారు పలుకులేకుండా ఇచ్చేసావు.



అర్థాంతరంగా నడివీధిలో వుంచి అమ్మా నాన్నా అప్పులు మిగిల్చి ఆడపిల్లల్ని వదిలి పోయిన్నాడూ మనం అధైర్యపడలేదు. గదిన్న ర పూరింట్లోనే మనం ఇద్దరి పెళ్ళిళ్ళు చేసాం. వాడు మర్చిపోయాడేమోగాని, వాడి కి పదమూడేళ్ళు వచ్చే వరకూ మనం ఆ గదిన్నర పూరింట్లోనే బ్రతికాం. కాని ఇల్లు చిన్నదనే భావం మనకేనాడూ రాలేదు. మనకో గది కావాలనీ అనిపించలేదు.

పిండికొద్దీ రొట్టె అనుకుని గడిపాం. వాడు చదువుకోసం పట్నం వెళ్తే— మనకు స్తోమతు వుందని పంపించామా?

ఏదో వేలువిడిచిన మేనత్తకు వారసుల్లేక ఇలా ఈ పొలాలు వచ్చి కలిసొయిగాని మనం ఏనాడైనా ఆశించామా?

వాడి వుద్దేశ్యం నాకు అర్థమైంది. మనన్ని చి వాడు డబ్బు తప్ప మరేం ఆశించడం లేదు.''

''కృష్ణే... ఏడుస్తున్నావా?''

టపటపమని రాలిన— వేడి కన్నీళ్ళ స్పర్శకు ఉలిక్కిపడి అడిగారు.

''లేదండీ... లేదు... మీరు చెప్పకపో యినా ఇది వరకే అర్థం చేసుకున్నాను.

ఆర్నెల్ల క్రితం మీకు పక్షవాతం వచ్చి ఆరోజులు వూరంతా తల్లక్రిందులైందిగాని వాడు మాత్రం రాలేదు. నెల తరువాత రాసిన ఉత్తరానికి జవాబు మాత్రం వచ్చింది

పిల్లలు పరీక్షలు— సెలవు దొరకక రావటం పడలేదు. వీలు చూసుకుని వస్తాను. మందులు వాడండి అని. ఆర్నెల్లుగా వాడికి వీలు కాలేదంటేనే అర్థమౌతోంది. ఒకటే బాధ... ఇలాంటి కొడుకు కోసమా అంత తాపత్రయపడ్డామని....''

''పోనీ కృష్ణే నాకు... నువ్వూ నీకు నేనూ... ఆటూ—పోట్లూ జీవితంలోనూ తప్పవు.

ఈ గాలివానలాగే...''

* * *

రాముడూ,

విని వుంటావు— గాలివానా— తుపానూ గురించి న్యాలోజులు మన పల్లెని ఓ వూపు వూపి అతలాకుతలం చేసి వెళ్లింది. కాని నా మనసుకు మాత్రం ఓ దారి చూపి మరీ వెళ్ళింది.

లంకలా ఈ పల్లె నీటిలో మునిగివున్న రోజుల్లోనే— అనుకోని ఆ క్షణం పెనుభూ తంలా వచ్చిపడింది.

మన దస్తావేజులన్నీ నీటి పాలయాయి. ఇపుడు మన పొలాలు మనవి కాదు— జనానివి— అన్నార్తులవి— అనాధలవి.

ఈ ఉత్తరం కాశీ యాత్రకని రైలెక్కి కూర్చుని రాస్తున్నాను. కాశీలో వుంటావని ఆశపడకు ఏ పుణ్యక్షేత్రానికి మనసు మరలి తే అటే వెళ్తాను.

అన్నట్టు అసలు సంగతి— గాలివాన మొదలైన రోజునే మీ నాన్నగారికి గుండె నొప్పి తీవ్రంగా వచ్చిపోయారు. కబురుపం పే మార్గం లేదు. ఊరి వాళ్లే నా అనుమతితో అంత్యక్రియలు జరిపారు.

పున్నామ నరకం నుండి తప్పించేవాడే పుత్రుడు. అందుకే వూరివాళ్లే మా కొడు కులు.